సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శనివారం । 23 । ఆగస్టు । 2025



దర్గా ఉత్సవాలు షురూ..

శుక్రవారం తెల్లవారుజామున సందల్ ముగియడంతో కాజీపేటలోని బియాబానీ దర్గా ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభం అయ్యాయి. - 8లో▸



పెన్షన్‌పై అవగాహన ఉండాలి

ఉద్యోగ విరమణ పొందే ఉద్యోగులు పెన్షన్, జీపీఎఫ్‌పై అవగాహన పెంపొందించు కోవాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

ఇంటర్ విద్యార్థులకూ ఎఫ్ఆర్ఎస్

నేటినుంచే అమలు.. రిజిస్ట్రేషన్ షురూ

- రోజుకు రెండుసార్లు హాజరు నమోదు
- గైర్హాజరైతే తల్లిదండ్రుల ఫోన్లకు సమాచారం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 50 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు



యాప్ డౌన్‌లోడ్ విధానం తన మొబైల్ ద్వారా చూపిస్తున్న వరంగల్ డీఐఈఓ శ్రీధర్ సుమన్

విద్యారణ్యపురి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంపునకు (శనివారం) నుంచి ఫేషియల్ రికగ్నేషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) (ఏఐ ఆధారిత ముఖ గుర్తింపు)ను అమలు చేయనున్నారు. ఇందుకోసం ఇంటర్ బోర్డు అధికారులు సెంటర్ బోర్డ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) సాంకేతిక సహకారంతో టీజీబీఐఈ – ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను ఇప్పటికే సిద్ధం చేశారు. ప్రతీరోజు రెండు సార్లు (ఉదయం, మధ్యాహ్న భోజనం తర్వాత) హాజరు తీసుకుంటారు. ఈమేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. కళాశాలకు ఏ విద్యార్థి అయినా హాజరుకాకుంటే అతడి తల్లిదండ్రుల ఫోన్‌కు సందేశం వెళ్తుంది. ఈ హాజరును ఆ కళాశాల ప్రిన్సిపాల్, డీఐఈఓ, రాష్ట్ర అధికారులు కూడా పర్యవేక్షిస్తారు. ఎఫ్ఆర్ఎస్ అమలుపై గత గురువారం ఆయా జిల్లాల్లో డీఐఈఓలు.. కాలేజీ ప్రిన్సిపాళ్లతో సమావేశాలు నిర్వహించి హాజరు అమలు విధానాన్ని తెలియజేశారు. హనుమకొండ, వరంగల్‌లో డీఐఈఓలు ఎ.గోపాల్, శ్రీధర్‌సుమన్ వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు.

జిల్లాల వారీగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, విద్యార్థుల వివరాలు

జిల్లా	కళాశాలలు	ఫస్టియర్	సెకండియర్
హనుమకొండ	09	2,900	2,013
వరంగల్	11	1,272	1,000
మానుకోట	10	1,350	1,200
ములుగు	08	734	821
భూపాలపల్లి	05	520	535
జనగామ	07	1,050	950

విద్యార్థులకు రోజుకు రెండు సార్లు హాజరు



- అధ్యాపకులు గూగుల్ ప్లేస్టోర్ నుంచి టీజీబీఐఈ –ఎఫ్ఆర్ఎస్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అందులో విద్యార్థుల ఫొటోతో సహా వివరాలు నమోదు చేయాలి.
- తరగతి ప్రారంభమయ్యాక స్మార్ట్ ఫోన్‌లో ఆ యాప్ ద్వారా కెమెరా ఓపెన్ చేసి వీడియా మాదిరిగా కూర్చున్న విద్యార్థులను తీసుకుంటూ వెళ్తే ఆటోమేటిక్‌గా ఫొటో క్యాప్చర్ అయి హాజరు నమోదవుతుంది.
- ఈ విధానంతో 15నుంచి 20 సెకన్లలోనే 80మంది విద్యార్థుల వరకు హాజరు నమోదు చేయవచ్చని చెబుతున్నారు.
- ముఖ హాజరుకు శుక్రవారం నుంచే రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. ఇంకా చేపట్టనివారు ఉంటే ఈనెల 23న చేపడతారు.
- కళాశాలల సమయం ఉదయం 9:30 గంటల నుంచి ప్రతీ తరగతి గదిలోని తొలి పీరియడ్ తీసుకునే అధ్యాపకుడు విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు చేస్తారు.
- మళ్లీ మధ్యాహ్నం లంచ్ తర్వాత 2గంటలకు మరోసారి నమోదు చేస్తారు.

ప్రతీ జిల్లాకు ఇద్దరికి ఏఐ చాంపియన్లుగా శిక్షణ



ఎఫ్ఆర్ఎస్ అమలుపై ప్రిన్సిపాళ్లకు సూచనలిస్తున్న హనుమకొండ డీఐఈఓ గోపాల్

ఇంటర్ విద్యలో కృత్రిమ మేధ పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని రాష్ట్ర బోర్డు నిర్ణయించింది. విద్యలో నాణ్యత పెంపు, విద్యార్థుల్లో నైపుణ్యాల అభివృద్ధి, సరికొత్త సాంకేతికత పరిచయం కోసం ఏఐని వినియోగించుకోనున్నారు. దీనిపై పట్టున్న సిబ్బందిని గుర్తించి ఏఐ చాంపియన్లుగా ఎంపిక చేసింది. ప్రతీ జిల్లాలోని అకడమిక్ మానిటరింగ్ సెల్‌లోని ఇద్దరు లెక్చరర్లు, ఒక లైబ్రేరియన్, ప్రతీ జిల్లాకు ఏఐ చాంపియన్లుగా ఎంపికైన ఒక లెక్చరర్, నాన్‌టీచింగ్ సిబ్బందికి శుక్రవారం హైదరాబాద్‌లో సంబంధిత ఉన్నతాధికారులు ఏఐ ఎఫ్ఆర్ఎస్ అమలు, వినియోగంపై శిక్షణ ఇచ్చారు.

ఇంటర్‌లో హాజరుశాతాన్ని పెంచేందుకే..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరు తక్కువగానే ఉంటోంది. ఉదయం కళాశాలకు వచ్చిన విద్యార్థుల్లో మధ్యాహ్నం భోజనం కోసం కొందరు ఇంటికి వెళ్లిపోతున్న పరిస్థితి ఉంది. తిరిగి రావడం లేదు. ఇంటివద్ద కాలేజీకి అని చెప్పి డుమ్మా కొట్టే పిల్లలు కూడా ఉన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణత తక్కువగా రావడానికి కూడా విద్యార్థులు తరగతులకు సరిగా హాజరుకాకపోవడమే అనేది ఇంటర్‌బోర్డు అధికారులు భావిస్తున్నారు. ఆయా సమస్యలకు పరిష్కారంగానే ఎఫ్ఆర్ఎస్‌ను అమలు చేస్తున్నారన్నది స్పష్టమవుతోంది.

న్యూస్‌రీల్

కుష్టు రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి



ఎంజీఎం: కుష్టు వ్యాధి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర కుష్టు నివారణ బృంద సభ్యులు అన్నారు. శుక్రవారం దేశాయిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బృందం సందర్శించింది. అక్కడి వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు వ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రిపోర్ట్స్, రికార్డ్‌ని పరిశీలించి కుష్టు వ్యాధి సర్వేపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర బృంద సభ్యులు డీపీఎంఓ వెంకటేశ్వర చారి, సకలరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఏపీఎంఓ అరుణ సుందర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ కొమురయ్య, జిల్లా లెప్రసీ అధికారి మోహన్‌సింగ్, డీపీఎంఓ అనుపమ, వెంకన్న, స్థానిక మెడికల్ ఆఫీసర్ భరత్ కుమార్, నోడల్ పర్సన్లు జన్ను కొర్నెల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐసెట్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ఈవిద్యాసంవత్సరం 2025–26లో ప్రవేశాలకు టీజీఐసెట్ అభ్యర్థులకు శుక్రవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పారంభమైంది. ఈమేరకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో, హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ హెల్ప్ లైన్ సెంటర్లలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభమైంది. ఆర్ట్స్ కాలేజీలో ధ్రువపత్రాలను ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి అందజేశారు. కేడీసీలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రం శ్రీనివాస్ అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్: హనుమకొండ జిల్లా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి ప్రేమకళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లో ఎస్జీటీ, పీడీ, స్కూల్ అసిస్టెంట్, హిందీ పండిట్, టీపీ–2 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 30లోపు హనుమకొండ అంబేడ్కర్ భవన్ ఎదురుగా ఉన్న జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నేడు ఇన్‌స్పైర్‌పై అవగాహన

విద్యారణ్యపురి: జిల్లాలోని ఇన్‌స్పైర్ మనక్ 2025–26పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించేందుకు ఈనెల 23న హనుమకొండలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు డీఈఓ వాసంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూళ్లలోని ఇన్‌స్పైర్ ఇన్‌చార్జ్‌లు విద్యార్థులతో నామినేషన్లు వేయించేలా శిక్షణ తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈనెల 23న ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే సమావేశానికి భీమదేవరపల్లి, దామెర, హనుమకొండ, హసన్‌పర్తి, కాజీపేట, ఐనవోలు మండలాల ఉపాధ్యాయులు పాల్గొనాలని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే సమావేశానికి ఆత్మకూరు, ధర్మసాగర్, ఎల్కతుర్తి, కమలాపూర్, నడికూడ, పరకాల, శాయంపేట, వేలేరు మండలాల ఉపాధ్యాయులు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామి 94901 12848 నంబర్‌లో సంప్రదించాలని డీఈఓ వాసంతి కోరారు.

‘గ్రేటర్’ సిగలో భారత్ మాల



జాతీయ రహదారులకు వరంగల్ మహానగరం అనుసంధానం

- తాజా నిర్ణయంతో ఫోర్ లేన్ రోడ్డుగా వరంగల్–ఖమ్మం హైవే
- మామునూరు ఎయిర్‌పోర్ట్‌కూ కొత్త రోడ్డు
- స్పీడ్‌గా మంచిర్యాల – విజయవాడ, వయా వరంగల్
- గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్లో వేగం

సాక్షిప్రతినిధి, వరంగల్ :

‘భారత్ మాల’ప్రాజెక్టు గ్రేటర్ వరంగల్‌కు వరంగా మారనుంది. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన జాతీయ రహదారులు వరంగల్ నగరాన్ని తాకేలా రూపుదిద్దుకుంటున్నాయి. ఇప్పటికే భువనగిరి – ఆరెపల్లి నేషనల్ హైవే పూర్తయి రాకపోకలు సాగుతున్నాయి. సిద్దిపేట – ఎల్కతుర్తి (765 డీజీ) హైవే రూ.578 కోట్లతో 64 కి.మీ.లు పూర్తి చేశారు. ఆ రోడ్డు సైతం 563 ఎన్‌హెచ్ నుంచి వరంగల్ ఔటర్ రింగు రోడ్డును తాకేలా డిజైన్ చేశారు. జగిత్యాల – కరీంనగర్ – వరంగల్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 563) నిర్మాణ పనులు సగం వరకు పూర్తయ్యాయి. తాజాగా వరంగల్ – ఖమ్మం నేషనల్ హైవేను సైతం భారత్ మాల కింద ఫోర్‌లేన్ రోడ్డుగా మార్చనున్నట్లు కేంద్రం నిర్ణయించింది. వీటికి తోడుగా నాగపూర్– విజయవాడ గ్రీన్ ఫీల్డ్ హైవే వరంగల్ మీదుగానే వెళ్తుండడంతో గ్రేటర్ వరంగల్ జాతీయ రహదారులకు సెంటర్ పాయింట్ కానుంది. త్వరలోనే ఎయిర్‌పోర్టు రానుండడం ... ఎన్‌హెచ్‌ల అనుసంధానంతో రవాణా పరంగా వరంగల్‌కు ఉపయోగం కలగనుంది.

ఔటర్ రింగ్ రోడ్డుతోనూ లింకు..

కరీంనగర్ – వరంగల్ మధ్యన ఈ రహదారి పొడవు 68.34 కిలోమీటర్లు కాగా, రూ.2,164 కోట్లతో ఈ పనులు సాగుతున్నాయి. గ్రేటర్ వరంగల్‌ను తాకుతూ వెళ్తున్న మంచిర్యాల–విజయవాడ జాతీయ రహదారికి.. మంచిర్యాల నుంచి వరంగల్ వరకు 112 కి.మీ.లు, రూ.2,490 కోట్లు కేటాయించారు. మంచిర్యాల నుంచి మంథని, చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి, వరంగల్, పరకాల, ఆత్మకూరు, శాయంపేట, దామెర మీదుగా వెళ్లే రోడ్డు పనులు మొదట భూసేకరణ వల్ల ఆలస్యమైనా ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి. వరంగల్ – ఖమ్మం మధ్య రహదారి 107 కి.మీ.ల కోసం రూ. 2,249 కోట్లు కేంద్రం కేటాయించగా, 1,410 ఎకరాల భూసేకరణ ప్రకియ జరిగింది. మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలో ఉండే ఈ రహదారి.. గ్రేటర్ వరంగల్ విలీన ప్రాంతాలతోపాటు ఊరుగొండ, గీసుకొండ, మచ్చాపూర్, సంగెం, నెక్కొండ, పర్వతగిరి, వెంకటయ్యపాలెం తదితర ముఖ్య పట్టణాలను తాకుతుంది. 765 డీజీగా పేరున్న సిద్దిపేట – ఎల్కతుర్తి రోడ్డు పొడవు 64 కి.మీ.లు కాగా.. ఈ రోడ్డు కోసం రూ.578 కోట్లు కేటాయించారు. ఆ రోడ్డు నిర్మాణం పూర్తి కాగా.. సిద్దిపేట, హుస్నాబాద్, ఎల్కతుర్తి ద్వారా వరంగల్‌కు చేరుకుంటున్నారు. ఐదేళ్ల కిందట అప్పటి సీఎం కేసీఆర్ సంగెం వద్ద శంకుస్థాపన చేశారు. వరంగల్ నూతన మాస్టర్‌ప్లాన్‌లో కొత్త ప్రాజెక్టు రీజినల్ ఔటర్ రింగురోడ్డు నగర శివారు నుంచి వెళ్లే ఐదు జాతీయ, రాష్ట్ర రహదారులను అనుసంధానం చేసేలా డిజైన్ చేసినా పెండింగ్‌లో ఉంది. సుమారు 135 కిలోమీటర్ల పొడవు ఉండే ఈ ఓఆర్ఆర్ కూడా అసంపూర్తిగా ఉంది. తక్షణమే ఆర్ఆర్ఆర్, ఓఆర్ఆర్‌లకు నిధులు విడుదల చేసి పూర్తి చేస్తే.. ఐదు జాతీయ, రాష్ట్ర రహదారులతో గ్రేటర్ వరంగల్‌కు మహర్దశ పట్టనుంది.

నగరాభివృద్ధికి దోహదం



నగరం చుట్టూ ఇన్నర్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారుల విస్తరణతోపాటు గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇవి పూర్తయితే నగరాభివృద్ధికి ఎంతగానే తోడ్పడతాయి. భారీ ట్రక్కులు, ఇతర వాణిజ్య వాహనాలు నగరంలోకి వెళ్లకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఇన్నర్ రింగ్ రోడ్డు నగరానికే మణిహారంగా నిలుస్తుంది.

– మేరుగు అశోక్, శివనగర్, వరంగల్

రవాణా వ్యవస్థ బలోపేతం..



రహదారుల నిర్మాణం వల్ల నగరంలో వాణిజ్య కార్యకలాపాలు అధికంగా పెరుగుతాయి. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లతో నగరంలో ట్రాఫిక్ తగ్గి ప్రయాణ సమయం ఆదా అవుతుంది. రవాణా వ్యవస్థ మరింత బలోపేతమవుతుంది. ఇప్పటికే టెక్స్‌టైల్ పార్క్ ఉంది. మరికొన్ని కంపెనీలు ఉన్నాయి. అదేవిధంగా మామునూరు ఎయిర్‌పోర్ట్ పూర్తి చేస్తే వాణిజ్యంగా అభివృద్ధి చెందుతుంది.

– గద్దం రవి, వరంగల్

కొత్త పరిశ్రమలకు అవకాశం



జాతీయ రహదారుల వల్ల వరంగల్ నగరం వ్యాపారపరంగా అభివృద్ధి చెందుతుంది. రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. కొత్త పరిశ్రమలు నెలకొల్పడానికి అవకాశం ఉంది. దీనివల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు సైతం మెరుగుపడతాయి.

– రామచంద్రారెడ్డి, రైతు, హసన్‌పర్తి

మురుగు నీటి తొలగింపు



మాట్‌లలోని నీటిని మోటారుతో తొలగిస్తూ..

న్యూశాయంపేట: ‘వన్యప్రాణుల మూగరోదన’ శీర్షికన సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అటవీశాఖ, జూ పార్క్ అధికారులు స్పందించారు. జూలోని వివిధ జంతువుల మాట్‌లలో నిల్వ ఉన్న మురికి నీటిని మోటార్లతో తొలగించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. జంతువుల ఎన్‌క్లోజర్ల వద్ద ఫినాయిల్, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. మొసళ్ల ఆవాసం ఉండే ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తున్నారు. అందులోని నీటిని తొలగించి స్వచ్ఛమైన నీటిని నింపేందుకు తగిన ఏర్పాట్లు చేశారు.

పదేళ్లు లేని కొరత ఇప్పుడెలా వచ్చింది?

- రేవంత్.. ప్రజలకు క్షమాపణ చెప్పు
- మాజీ మంత్రి దయాకర్‌రావు



రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

హసన్‌పర్తి: మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. హసన్‌పర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని దయాకర్‌రావు శుక్రవారం సందర్శించారు. యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్ల లేని యూరియా కొరత ఇప్పుడెందుకు ఏర్పడుతోందని ప్రశ్నించారు. ఈసందర్భంగా వ్యవసాయాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే యూరియా విడుదల చేయకపోతే సొసైటీ ఎదుట రైతులతో ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, ఆత్మ జిల్లా మాజీ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, గ్రామాభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి జన్ను కిషన్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు కుమారస్వామి, కర్ణాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఇమ్మడి రాజేందర్, బీఆర్ఎస్ గంటూరుపల్లి శాఖ అధ్యక్షుడు గన్నోజు రవీందర్ ఉన్నారు.

నాణ్యమైన ప్రమాణాలతో బోధించాలి

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హసన్‌పర్తి: నాణ్యమైన విద్యాప్రమాణాలతో పాఠ్యాంశాల బోధన సాగించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. హసన్‌పర్తి మండలం జిల్లా పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె సందర్శించారు. తొలుత ఏడు, పదోతరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఉపాధ్యాయులు నిర్వహించిన ప్రారంభ పరీక్షకు సంబంధించి జవాబు పత్రాలను సరిచూశారు. అంగన్‌వాడీ కేంద్రంలో నమోదైన చిన్నారుల గురించి తెలుసుకున్నారు. స్థానికంగా పాఠశాల ఉన్నప్పటికీ విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడానికి కారణాలు తెలుసుకుని నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ, పాఠశాల్లోని రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఓ వాసంతి, ఎంఈఓ ఎ.శ్రీనివాస్, తహసీల్దార్ చల్లా ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మేజర్ ధ్యాన్‌చంద్ క్రీడోత్సవాలు

వరంగల్ స్పోర్ట్స్: హాకీ క్రీడా మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి(జాతీయ క్రీడా దినోత్సవం)ను పురస్కరించుకుని ఈనెల 23 నుంచి 31వ తేదీ వరకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ డీవైఎస్ఓ గుగులోతు అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జేఎన్ఎస్‌లో స్వచ్ఛభారత్‌తో పాటు పదేళ్లలోపు పిల్లలకు పరుగు, బేబీ క్రాలింగ్, మ్యూజికల్ చైర్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 24న ఉదయం నేషనల్ స్పోర్ట్స్ డే రన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యువత, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వృద్ధుల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ కె.పట్టాభి రామారావు
- డే కేర్ సెంటర్‌లో లీగల్ ఎయిడ్ క్లినిక్



బీపీ పరీక్షించుకుంటున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ కె.పట్టాభి రామారావు

హన్మకొండ: వృద్ధుల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ కె.పట్టాభిరామారావు అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండ జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండేతో కలిసి జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ పట్టాభి రామారావు ప్రారంభించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కంటి పరీక్షలు చేయించుకున్నారు. బీపీ పరీక్షించుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పట్టాభి రామారావు మాట్లాడుతూ.. వృద్ధులు తమ అనుభవాలను, సేవలను సమాజానికి అందించాలన్నారు. వృద్ధులకు అనుభవం, సమర్థత ఉంటుందని ఇది కుటుంబానికి, సమాజానికి అవసరమన్నారు. వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌లో వారానికి ఒకసారి సమావేశమై హక్కులపై సమాజానికి మార్గదర్శనం చేయాలన్నారు. డే కేర్ సెంటర్‌లో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే త్వరలో ఈ కేంద్రంలో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే, సీనియర్ న్యాయమూర్తులు ఎం.రామలింగం, ఉషాక్రాంతి, బన్ను ఆరోగ్య సేవా సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ చిరంజీత్ రెడ్డి, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు యుగేందర్, దేవాచారి, డాక్టర్ మౌనిక, రవీందర్ రెడ్డి, ఉష, ఎఫ్ఆర్ఓ రవి కృష్ణ, వాణి, శ్రీధర్, డాక్టర్లు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

వరంగల్ కలెక్టర్ సత్యశారద



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

న్యూశాయంపేట: కళాశాలల్లో విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద సూచించారు. కలెక్టరేట్‌లో అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి కమిటీలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, కమిటీ చైర్మన్లతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 10 జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులు ఎలా ఉన్నాయని ప్రిన్సిపాళ్లు, కమిటీ చైర్మన్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.1.36 కోట్లను కేటాయించిందని తెలిపారు. ప్రిన్సిపాళ్ల ఖాతాలకు కేటాయించిన ఈ బడ్జెట్‌తో కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, ఇంటర్ విద్యాధికారి శ్రీధర్ సుమన్, కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దూరవిద్య డిగ్రీ పరీక్షలు ప్రారంభం

● 8 మంది విద్యార్థులు డీబార్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య డిగ్రీ బీఏ, బీకాం జనరల్, కంప్యూటర్స్, బీఎస్సీ ఫైనలియర్ విద్యార్థులకు ఇయర్‌వైజ్‌స్కీం (ఎక్స్, రెగ్యులర్) పరీక్షలు శుక్రవారం 14 కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. వరంగల్ ఏఎస్ఎం, ఎల్‌బీ కాలేజీ కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ పట్టుబడిన విద్యార్థులను డీబార్ చేసినట్లు అదనపు పరీక్షల నియంత్రణాధికారి పద్మజ తెలిపారు. ఏఎస్ఎం కాలేజీలో ఒకరు, ఎల్‌బీకాలేజీ కేంద్రంలో ఏడుగురు డీబార్ అయ్యారని తెలిపారు. ఇదిలా ఉండగా హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్‌కాలేజీ కేంద్రాన్ని పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి పద్మజ సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు.

అంతర్జాతీయ జూడో రెఫరీగా నాగరాజు



మడికొండ: హనుమకొండ జిల్లా మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల జూడో కోచ్ నాగరాజు అంతర్జాతీయ జూడో రెఫరీగా ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి తెలిపారు. ఇంటర్నేషనల్ జూడో ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు జోర్డాన్ రాజధానిలో జూడో రెఫరీ పరీక్షలు జరిగాయి. ఇందులో తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోని హనుమకొండ జిల్లా కేంద్రానికి చెందిన నాగరాజు ఒక్కరే ఉత్తీర్ణత సాధించారు. తెలుగు రాష్ట్రాల నుంచి మొదటిసారి అంతర్జాతీయ జూడో రెఫరీగా ఎంపికైన నాగరాజును ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి అభినందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మడికొండ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, సాంఘిక సంక్షేమ విద్యా సంస్థల కార్యదర్శి అలుగ వర్షిణి, మల్టీజోనల్ ఆఫీసర్ అలివేలు, విద్యారాణి ప్రోత్సాహంతోనే ఈవిజయం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది నాగరాజును అభినందించి సన్మానించారు.

ఎస్జీటీల పదోన్నతి ప్రక్రియ

● సీనియార్టీ లిస్టుపై కసరత్తు
● వేకెన్సీల జాబితా వెల్లడి

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా తత్సమాన పీఎస్‌హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించేందుకు ప్రక్రియ చేపట్టారు. ఈమేరకు ఈ పదోన్నతుల షెడ్యూల్ ప్రకారం.. శుక్రవారం సీనియార్టీ లిస్టును వెల్లడించాల్సి ఉన్నప్పటికీ రాత్రి 9:30 గంటలవరకు వెల్లడించలేదు. ఒక పోస్టుకు ముగ్గురు టీచర్ల చొప్పున సీనియార్టీ జాబితాను వెల్లడించనున్నారు. ఈనెల 23న అభ్యంతరాలు స్వీకరించాల్సి ఉంటుంది. 4న తుది సీనియార్టీ జాబితాను కూడా వెల్లడించాల్సి ఉంటుంది. ఈనెల 25న ఎస్జీటీ ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. ఈనెల 26న పదోన్నతుల ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

ఏస్‌పేల వేకెన్సీలు ఇలా..

హనుమకొండ జిల్లాలో 1,431 స్కూల్ అసిస్టెంట్ల పోస్టులు మంజూరీ ఉండగా ప్రస్తుతం 1,237 మంది ఎస్ఏలు విధులు నిర్వర్తిస్తున్నారు. 194 వేకన్సీలుగా ఉన్నాయి. 18 జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూల్స్ పోస్టులున్నాయి. 30 వేకెన్సీలు డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌కు 147 ఎస్ఏలకు పదోన్నతులు కల్పించనున్నట్లు సమాచారం.

నాలుగేళ్లుగా గ్రహణం

● ఎంజీఎంలో సంతాన సాఫల్య కేంద్రం టెండర్లకే పరిమితం
● సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోనూ ఏర్పాటుకు అడ్డంకులే
● ప్రైవేట్ సెంటర్లలో రూ.లక్షలు చెల్లిస్తున్న పిల్లలు లేని దంపతులు
● త్వరగా అందుబాటులోకి తేవాలని కోరుతున్న నగరవాసులు

సాక్షి, వరంగల్: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో సంతాన సాఫల్య కేంద్రం (ఐవీఎఫ్) ఏర్పాటుకు నాలుగేళ్లుగా గ్రహణం పట్టుకుంది. 2021లో ఎంజీఎంలోని మాతా శిశుభవనం రెండో అంతస్తులో సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి మంజూరునిచ్చినా ఆ పనులే అటకెక్కాయి. అప్పటికే ఓ ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు పనులు కేటాయించింది. వాటర్ లీకేజీతో అక్కడ సురక్షితం కాదన్న తెలంగాణ ప్రభుత్వ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల సంస్థ కొత్తగా నిర్మిస్తున్న 24 అంతస్తుల్లోని మల్టీసూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేద్దామని భావించింది. ఎల్అండ్‌టీ సంస్థ టెండర్ నిబంధనల ప్రకారమే తాము ముందుకెళ్తామని, ఈ ఐవీఎఫ్ సెంటర్‌కు సంబంధించి కూలింగ్ ల్యాబ్, ఇతర పరికరాలు అక్కడ ఏర్పాటు చేయలేమని స్పష్టం చేసింది. కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోనే ఈ ఐవీఎఫ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఇటీవల నిర్ణయించినా ఇంకా ఆచరణలోకి రాలేదు. దీని సాధ్యాసాధ్యాలపై త్వరలోనే నిర్ణయం ఉంటుందని ఎంజీఎం అధికారులు చెబుతున్నారు. ఓవైపు పిల్లలు కావాలనుకునే దంపతుల ఆశను క్యాష్ చేసుకొని ప్రైవేట్ ఐవీఎఫ్ కేంద్రాలు రూ.లక్షల్లో గుంజుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేద్దామనుకున్న సంతాన సాఫల్య కేంద్రం ఏళ్లుగా పెండింగ్‌లో ఉండడం వాళ్లకు కలిసొస్తుందనే విమర్శలొస్తున్నాయి. సీకేఎం ప్రసూతి ఆస్పత్రిలో ఈ ఏడాది మార్చి 15న ఏర్పాటుచేసిన ఫెర్టిలిటీ క్లినిక్ మెడికేషన్‌కు మాత్రమే పరిమితమైంది. పిల్లలు లేని దంపతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు సాధ్యమైనంత తొందరగా ఐవీఎఫ్ కేంద్రాన్ని ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.



సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటుకు నిధులు కేటాయించిన వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రి

ఐవీఎఫ్‌తో ఫలితం లేకుంటే ఐయూఐ..

మందులతో సంతానం కలుగకపోతే వైద్యులు దంపతులకు ఇంట్రా యుటెరిన్ ఇన్సామినేషన్ (ఐయూఐ) పద్ధతి సూచిస్తారు. దీని ద్వారా గర్భాశయంలో ప్రత్యక్షంగా వీర్యాన్ని విడుదల చేస్తారు. చాలా వరకు ఐయూఐతోనే పరిష్కారం దొరుకుతుంది. కొందరికి ఇందులో కూడా ఫలితం కనిపించకపోతే ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) పద్ధతి సూచిస్తారు. ఈ పద్ధతిలో శరీరంలో అండోత్పత్తిని మందులతో పెంచి, అండాన్ని సేకరిస్తారు. శుక్రకణాలతో అండాన్ని ల్యాబ్‌లో ఫలదీకరిస్తారు. మిగతా పరీక్షలు పూర్తిచేసినంతరం మహిళ గర్భంలోకి పంపిస్తారు. ప్రైవేట్ సంతాన సాఫల్య కేంద్రాల్లో ఐవీఎఫ్ చేయించుకోవాలంటే సుమారు రూ.లక్షల్లో వసూలు చేస్తుండడం పేద, మధ్య తరగతి కుటుంబాలకు భారం కానుంది. 'ఉమ్మడి వరంగల్ జిల్లాలో పిల్లలు లేని దంపతులకు ఐవీఎఫ్ కేంద్రం ఓ భరోసాగా నిలువనుంది. ఇటీవల హైదరాబాద్‌లో సృష్టి నిర్వాహకులు చేసిన అక్రమ దందా ప్రకంపనలు సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసే ఐవీఎఫ్‌తో పిల్లలు లేని దంపతులకు ఆర్థిక ఇబ్బందులు తప్పుతాయి' అని ప్రభుత్వ వైద్యులు పేర్కొంటున్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌పై సమీక్ష

తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ కమ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సౌకర్యాల కల్పన ఏర్పాట్లపై శుక్రవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి నేతృత్వంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్.నాగరాజు, కలెక్టర్ స్నేహ శబరీష్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ సమావేశమై చర్చించారు.

\- నయీంనగర్



ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలి



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

● అడిషనల్ డిప్యూటీ కమిషనర్ రవి

విద్యారణ్యపురి: విద్యార్థినులు ఆధునిక సాంకేతికతను కూడా వినియోగించుకోవాలని, భవిష్యత్‌లో ఆర్థికస్వావలంబన సాధించే దిశగా చదువుకోవాలని వరంగల్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, ఇండియన్ పోలీస్ మెడల్ అవార్డు గ్రహీత ఎన్.రవి అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కాలేజీలో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇన్ కెమికల్ అండ్ అలైడ్ సైన్సెస్ రీసెర్చ్' అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది ఈ సదస్సులోఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశలోనే లక్ష్యంతో ముందుకెళ్లాలని విద్యార్థినులకు సూచించారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సీనియర్ ప్రొఫెసర్ లలితాగురుప్రసాద్ కీలకపోన్యాసం చేస్తూ రసాయన శాస్త్ర అనుబంధ శాస్త్ర పరిశోధనల్లో ఆధునిక సాంకేతికత కృత్రిమ మేధా.. సాంకేతికతలో వస్తున్న ఆధునిక పోకడల విశిష్టతను తెలియజేస్తుందన్నారు. సదస్సులో ఆ కళాశాల ప్రిన్సిపాల్ బి. చంద్రమౌళి, కేయూ సైన్స్‌విభాగాల డీన్ జి. హనుమంతు, కెమిస్ట్రీ విభాగం అధిపతి ఎన్.వాసుదేవరెడ్డి, కేయూ కెమిస్ట్రీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్లు సి.హెచ్. సంజీవరెడ్డి, వడ్డె రవీందర్ మాట్లాడారు. ఈ సదస్సులో సావనీర్‌ను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి. సుహాసిని, జాతీయ సదస్సు కన్వీనర్ ఎం.ప్రశాంతి, అధ్యాపకులు సురేశ్‌బాబు, ఉదయశ్రీ, బాలరాజు,జ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఈనెల 23న జాతీయసదస్సు ముగియనుంది.

పెన్షన్, జీపీఎఫ్‌పై అవగాహన ఉండాలి

● హనుమకొండ కలెక్టర్ స్నేహాశబరీష్

హన్మకొండ అర్బన్ : విరమణ పొందే ఉద్యోగులు పెన్షన్, జీపీఎఫ్‌పై అవగాహన పెంపొందించుకోవాలని హనుమకొండ కలెక్టర్ స్నేహాశబరీష్ అన్నారు. శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో విశ్రాంత ఉద్యోగుల పెన్షన్, జీపీఎఫ్ సమస్యలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ పెన్షన్, జీపీఎఫ్‌పై ఖజానా శాఖ ఆధ్వర్యంలో మంచి కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ గురించి పూర్తి తెలుసుకోవాలన్నారు. అనంతరం ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిట్, హైదరాబాద్ ఏజీ కార్యాలయ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ అభయ్ అనిల్ సొనార్కర్, నరేశ్‌కుమార్ మాట్లాడుతూ పెన్షన్, జీపీఎఫ్ సమస్యల పరిష్కారం కోసం అదాలత్ నిర్వహించామని, తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి బృందాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెన్షనర్లకు పెన్షన్ చెల్లింపు ఆర్డర్లు, జీపీఎఫ్ మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. వరంగల్, హనుమకొండ డీఆర్‌ఓలు వై.వి గణేశ్, విజయలక్ష్మి, హనుమకొండ జిల్లా డీటీఓ శ్రీనివాసకుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లాల డీడీఓలు, పెన్షనర్లు, తదితరులు పాల్గొన్నారు.



పెన్షన్ చెల్లింపు ఆర్డర్ పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

ఉమ్మడి వరంగల్ జిల్లాకు భారీగా నిధులు..

● పీఆర్ శాఖకు రూ.23.50 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం



హన్మకొండ: రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క చొరవతో తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ రాజ్(పీఆర్) శాఖ ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాకు భారీగా నిధులు కేటాయించింది. శుక్రవారం రూ.23.50 కోట్లు కేటాయించి విడుదల చేసింది. ఈ నిధులతో ఇంటిగ్రేడ్, మండల ప్రజాపరిషత్ కార్యాలయాల భవనాలు నిర్మించనున్నారు. ములుగు జిల్లాలో ఎస్‌ఈ కార్యాలయం నిర్మాణానికి రూ.1.50 కోట్లు, వరంగల్ జిల్లాలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.8 కోట్లు, మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో మహిళా స్వయం సహాయక సంఘాల భవనానికి రూ.2 కోట్లు, ములుగులో ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.1.50 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం పరిపాలన మంజూరు చేసింది. అదే విధంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల, భూపాలపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయం, హనుమకొండ జిల్లా వేలేరు, దామెర మండల ప్రజా పరిషత్ కార్యాలయం నిర్మాణం, ములుగు జిల్లా మల్లంపల్లి ఎంపీపీ కార్యాలయం, ములుగు జిల్లా ఏటూరునాగారంలో ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణం, మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరులో ఎంపీడీఓ కార్యాలయం నిర్మాణానికి రూ.1.50 కోట్ల చొప్పున కేటాయిస్తూ నిధులు మంజూరు చేసింది.

ఎన్‌హెచ్163 పనులు పూర్తి చేయాలి

● కేంద్ర మంత్రి గడ్కరీని కోరిన ఎంపీ కావ్య



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ కావ్య

హన్మకొండ చౌరస్తా: నేషనల్ హైవే 163 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో గడ్కరీని కావ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యాదాద్రి-వరంగల్ జాతీయ రహదారి 163 (హైదరాబాద్-భూపాలపట్నం రోడ్) లో పెండింగ్ లో ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. జాతీయ రహదారి నాలుగు లేన్లుగా విస్తరించినా కొన్ని గ్రామాల వద్ద సర్వీస్ రోడ్లు అనుసంధానం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిడిగొండ, రఘునాథపల్లి, ఛాగల్లు, స్టేషన్ ఘన్‌పూర్, కరుణాపురం గ్రామాల వద్ద రోడ్డు ఉన్నా జనగామ నుంచి ఈ గ్రామాల మధ్యలో లింక్ లేకపోవడం సమస్యగా మారిందన్నారు. నేరుగా ప్రధాన రహదారి పైకి రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి..సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు ఎంపీ కావ్య తెలిపారు.

గంజాయి రవాణాదారుడికి జైలు, జరిమానా

వరంగల్ లీగల్ : విద్యార్థులకు ఎండు గంజాయి విక్రయించడానికి యత్నించిన పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం గోదావరిఖనికి చెందిన నేరస్తుడు ఎస్.డి. ఇమ్రాన్‌పాషాకు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి బి.అపర్ణాదేవి తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజమల్లారెడ్డి కథనం ప్రకారం.. 2019, డిసెంబర్ 7న సాయంత్రం 7 గంటల సమయంలో కాజీపేట ఇండియన్ గ్యాస్ కంపెనీ వద్ద ఇద్దరు వ్యక్తులు చేతి సంతో ఉన్నారు. పోలీసులను చూసి పారిపోవడానికి యత్నించారు. గమనించిన పోలీసులు వారిని పట్టుకుని సంచిని తనిఖీ చేయగా ఎండు గంజాయి లభించడంతో కాజీపేట తహసీల్దార్ సమక్షంలో విచారించారు. ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల గొల్లపల్లికి చెందిన గుడిపాటి రిత్విక్‌రెడ్డి, మరొకరు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ఎస్.డి. ఇమ్రాన్‌పాషాగా నిర్ధారించారు. అనంతరం విచారించగా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో విద్యార్థులకు గంజాయి విక్రయించడానికి యత్నించినట్లు ఒప్పుకున్నారు. దీంతో పోలీసులు నిందితుల నుంచి 50 గ్రాముల చొప్పున మూడు ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువుకావడంతో నేరస్తుడు ఎస్.డి ఇమ్రాన్ పాషాకు 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ జడ్జి అపర్ణాదేవి తీర్పు వెలువరించారు. మరో నిందితుడు రిత్విక్‌రెడ్డి విచారణ సమయంలో మృతి చెందాడు. కేసును పోలీస్ అధికారులు సుధాకర్‌రెడ్డి, ఆర్.నరేందర్, డి.దేవేందర్ పరిశోధించారు. లైజన్ ఆఫీసర్ పరమేశ్వరి, కుమారస్వామి పర్యవేక్షణలో కానిస్టేబుల్ ఎ.సుధాకర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

92 దస్తావేజులకు ఈ-సైన్ రిజిస్ట్రేషన్

కాజీపేట అర్బన్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పైలట్ ప్రాజెక్ట్‌లో ఎంపిక చేయగా గురువారం ఈ- సైన్ రిజిస్ట్రేషన్లు విజయవంతంగా పూర్తి చేశారు. రెండో రోజు శుక్రవారం కాజీపేట వంద ఫీట్ల రోడ్డులోని వరంగల్ ఆర్వో కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్లు రామ నరసింహరావు,ఆనంద్ 92 దస్తావేజులకు ఈ-సైన్ పద్ధతిలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు.

బ్యాంకు అభివృద్ధే ధ్యేయం..

● రూ.400 కోట్ల టర్నోవర్‌తో ముందుకు
● రాష్ట్ర వ్యాప్తంగా బ్యాంకు శాఖలు విస్తరిస్తాం
● వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

ఖిలా వరంగల్ : వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకును ఆర్థికంగా అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని, రూ.5కోట్ల టర్నోవర్‌తో కొనసాగుతున్న బ్యాంకు రూ.400 కోట్లతో అభివృద్ధిలో దూసుకెళ్తోందని ఆ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. శుక్రవారం వరంగల్ కాశిబుగ్గలోని అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో నూతన కమిటీ ప్రమాణస్వీకారం జరిగింది. అధ్యక్షుడిగా ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వైస్ చైర్మన్‌గా తోట జగన్నాథం, డైరెక్టర్లుగా నీలం మల్లేశం, మందా స్వప్న, బానోత్ సీతా మహాలక్ష్మి, చకిలం ఉపేందర్, కూరపాటి చంద్రమౌళి, ఐన వోలు వెంకటసత్యమోహన్, వడ్నాల సదానందం, ముందాడా వేణుగోపాల్, రవత్తి కృష్ణ, మహ్మద్ సర్వర్ అహ్మద్ పాషా.. ఎన్నికల అధికారి వాల్యా నాయక్ నేతృత్వంలో ప్రమాణస్వీకారం చేశారు. నంతరం జరిగిన కార్యవర్గ సమావేశంలో అధ్యక్షుడు ప్రదీప్‌రావు మాట్లాడారు. 1995లో ఒక్క శాఖతో ప్రారంభమైన బ్యాంకును పది శాఖలకు విస్తరించడంతోపాటు ఆర్థిక శక్తి గల బ్యాంకుగా అభివృద్ధి చేశానని తెలిపారు. త్వరలోనే రాజకీయాలకతీతంగా బ్యాంకు సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింపజేస్తానన్నారు. నిబంధనల ప్రకారం మహిళలకు తక్కువ వడ్డీకి రుణాలు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది సంపత్ రావు, కర్నె రవీందర్, మంద శ్రీనివాస్, కందిమళ్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఓరుగల్లు జానపద జాతర

హన్మకొండ కల్చరల్: ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, అంజలి మీడియా గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఓరుగల్లు జానపద జాతర-25 అలరించింది. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరేళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో జానపద కళాకారులు స్వర్గీయ దీకొండ సారంగపాణి, కూనమల్ల శంకర్ స్మారకంగా గ్రూప్ చైర్మన్ కామిశెట్టి రాజు పటేల్ అధ్యక్షతన జానపద జాతర నిర్వహించారు. ఈసందర్భంగా కళాకారులు గోల్కొండ బుచ్చన్న, తాళ్ల సునీత్, జూపాక శివ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా, వివిధ జిల్లాల నుండి జానపద గాయనీగాయకులు పాల్గొని శంకర్, సారంగపాణి పాటలను ఆటపాటలతో అలరించారు. కాకతీయ బుక్ ఆఫ్ నేషనల్ రికార్డ్ సర్టిఫికెట్‌ను సారంగపాణి కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రచయిత వల్లంపట్ల నాగేశ్వరరావు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్, సినీగేయ రచయిత, గాయకుడు వరంగల్ శ్రీనివాస్, జానపద ఉద్యమ కవి గిద్దె రాంనర్సయ్య, సంగీత దర్శకులు సీతాల రఘువేందర్, వెన్నెల శ్రీనాథ్, ఆకుల సదానందం, గూడూరు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు

దర్గా ఉత్సవాలు షురూ..

భక్తులతో కిక్కిరిసిన కాజీపేట బియాబానీ దర్గా





ప్రార్థనలు చేస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు నాగరాజు, రాజేందర్‌రెడ్డి, మేయర్ సుధారాణి, సీపీ సన్‌ప్రీత్

● లక్షమందికిపైగా సందర్శన..
● చాదర్‌లు సమర్పించి మొక్కులు..

కాజీపేట: కాజీపేట బియాబానీ దర్గా ఉత్సవాలు షురూ అయ్యాయి. శుక్రవారం తెల్లవారుజామున సందల్ ముగియడంతో ఉర్సు లాంఛనంగా ప్రారంభమైంది. భక్తులతో దర్గా కాజీపేట పరిసర ప్రాంతాలు కిక్కిరిసి పోతున్నాయి. కులమతాలతీతంగా తరలొచ్చి దర్గాను దర్శించుకుని పూలు, చాదర్‌లు సమర్పించి మొక్కులు సమర్పించుకుంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో సాయుధ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. కాగా, ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపించకపోవడంతో భక్తులు ప్రైవేట్ వాహనాల్లో ఇబ్బందులు పడుతూ దర్గా చేరుకుంటున్నారు. గురువారం అర్ధరాత్రి దాదాపు లక్షమందికిపైగా భక్తులు దర్గాను దర్శించుకున్నారని నిర్వాహకుల అంచనా. దేశంలోని 25 దర్గాల మత పెద్దలు బియాబానీ దర్గాను సందర్శించి పీఠాధిపతి ఖుస్రూపాషాను ఆశీర్వదించారు.

దర్గాను దర్శించుకున్న ప్రజాప్రతినిధులు, అధికారులు..

బియాబానీ దర్గాను ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎంపీ కడియం కావ్య, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ స్నేహ శబరీష్, సీపీ సన్‌ప్రీత్‌సింగ్, అదనపు డీసీపీ రాయల ప్రభాకర్ రావు, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అజీజ్‌ఖాన్, మాజీ కార్పొరేటర్ అబుబక్కర్ తదితరులు దర్శించుకున్నారు.

రిమాండ్ మహిళా ఖైదీకి పోస్టుమార్టం

నర్సంపేట రూరల్ : రిమాండ్ మహిళాఖైదీకి ఫోరెన్సిక్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. నర్సంపేట సబ్ జైలు రిమాండ్ మహిళా ఖైదీ పెండ్యాల సుచరిత (36) ఈనెల 21న మృతి చెందిన విషయం విదితమే. తొలుత నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి, తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, టౌన్‌సీఐ రఘుపతిరెడ్డి సమక్షంలో పంచనామా నిర్వహించారు. అనంతరం వరంగల్ కేఎంసీ ఫోరెన్సిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సురేందర్, సిద్దిపేట మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ హెచ్‌ఓడీ శ్రీధరాచారి, కుత్బుల్లాపూర్ మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ హెచ్ఓడీ వసంత నాయక్‌తోపాటు నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, తహసీల్దార్ రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సుచరిత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



సుచరిత కుటుంబీకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

భద్రకాళి అమ్మవారు



శ్రీరాజరాజేశ్వరి అమ్మవారు



శ్రావణ ప్రత్యేక పూజలు

హన్మకొండ కల్చరల్: శ్రావణంలో చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని నగరంలోని ఆలయాల్లో సందడి నెలకొంది. వేయి స్తంభాల ఆలయంలో అర్చకుల ప్రత్యేక పూజల అనంతరం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దేవాలయాన్ని సందర్శించారు. భద్రకాళి అమ్మవారిని తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిట్ దర్శించుకున్నారు. వారి వెంట తహసీల్దార్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు. ఎల్లంబజార్‌లోని సాయిసేవాదళ్ భజన మందిరంలో సాయిబంధు మహిళా సభ్యులు అష్టలక్ష్మి ప్రతిమలకు గణపతిపూజ, అష్టలక్ష్మి పూజ, కుంకుమపూజలు నిర్వహించారు. వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని, శ్రీచక్రాన్ని పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. హంటర్ రోడ్డులోని సంతోషిమాత దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

వరంగల్ డీఈఓ విధులనుంచి జ్ఞానేశ్వర్ రిలీవ్

● ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచన

విద్యారణ్యపురి: వరంగల్ డీఈఓ (ఎఫ్ఏసీ) ఎం.జ్ఞానేశ్వర్‌ను ఆ బాధ్యతలనుంచి రిలీవ్ చేస్తూ శుక్రవారం రాత్రి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్‌నికోలస్ ఉత్తర్వులు జారీచేశారు. ఆయనను నిర్మల్ డీఈఓ కార్యాలయంలో ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ (ఎఫ్ఏఓ) నియమించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు వరంగల్ జిల్లా విద్యాశాధికారిగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారదను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కోరారు.

ఉపాధ్యాయ సంఘాల ఫిర్యాదు ఫలితం

జ్ఞానేశ్వర్ ఇటీవల ఎంఈఓల జూమ్ మీటింగ్ జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ సుజన్‌తేజపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆయన ఉపాధ్యాయులపై కూడా దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో సుజన్‌తేజతోపాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు కలిసి డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కలెక్టర్, పోలీస్ అధికారి, ఎమ్మెల్యేలు, ఎంపీకి ఫిర్యాదు కూడా చేశారు. ఉపాధ్యా సంఘాల రాష్ట్ర బాధ్యులు కూడా జ్ఞానేశ్వర్ తీరుపై పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జ్ఞానేశ్వర్‌ను ఇక్కడ బాధ్యతలనుంచి రిలీవ్ చేయడం చర్చనీయాంశంగా మారింది.